# ఆత్మార్పణం

పొలంవెళ్ళి వస్తున్నా. అప్పటికే చాలా పొద్దుపోయింది. చకచకా నడుస్తూ చెరువుగట్టుమీదకు వచ్చాను. కాలిబాటలో అడుగుపెట్టానో లేదో కాలికి ఏదో మెత్తగా తగిలింది. చప్పున ఆగాను. మరుక్షణంలోనే స్ఫురించింది అదేమిటో. వెంటనే దెబ్బతియ్యడానికే కర్ర ఎత్తాను.

రెండుబారల పొడవున లావుగా, నల్లగా ధగధగ మెరిసిపోతున్నది అప్పుడే కుబుసం విప్పింది కాబోలు దాని శరీరం మరీ నిగనిగలాడుతున్నది. అది ఆగి నన్ను నిలవేస్తుందికదా అనుకొన్నాను. కాని ఆ నాగుపాము వెనుతిరిగి చూడనైనా చూడకుండా జరజర ప్రాకిపోతున్నది దాని శీఘ్ర గమన వేగాన్ని గమనిస్తూ అందుకు అల్లా ఒక్క క్షణం ఉండిపొయ్యాను.

అలా అంతకు ముందెన్నడూ జరగలేదు. ఇంతవరకు పాము కంటపడితే నేను పదిలిపెట్టిందలేదు. కంటపడి తప్పించుకొని పోయిన సందర్భంఅంటూ లేనేలేదు. చాలా చిన్నప్పుడే మా గ్రామంలో సూర్యప్రకాశరావు గారిని చూచి పామును కొట్టడంలో ఒడుపు నేర్చుకొన్నాను. అది నిలవేసినప్పుడు ఎంత గుండెధైర్యం ఉండాలో అంతకంటె ముఖ్యంగా ఎంతధైర్యం ప్రదర్శించాలో అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాను. అప్పటిలో అదొక విద్యగా పరిగణించాను. సూర్యప్రకాశరావుగారు పామును మరీ నేర్పుగా కొట్టేవారు. గురిపెట్టి ఒక్కదెబ్బతో దానితల ప్రక్కలు చేసేవారు.

అలా గురిపెట్టి కొట్టటం నిజంగా కష్టం పాము అంత తేలిగ్గా దెబ్బతినదు. ధానికి తెలివితేటలు ఎక్కువ. సమయస్ఫూర్తి మరీ ఎక్కువ.

మెరుపు తీవనైనా గురిపెట్టి కొట్టవచ్చును కాని త్రాచు పామును కొట్టడం కష్టమనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో, ఒక్కొక్కసారి అర్థలిప్త కాలంలో అమితాశ్చర్యజనకంగా దెబ్బ తప్పించుకొని బుస్సుమని మీదకు వస్తుంది ఎదిరి గుండె జెదిరిపొయ్యేలా. దెబ్బ తప్పించుకొన్నదీ అంటే కాటువేసిందన్న మాటే. మరొక్కొక్కసారి పాము మనిషిని నిలవేస్తుంది. ఆసమయంలో కదిలితే కాటువేస్తుంది. కాటందుకొనే దూరంలో చర్రున లేచి నిలబడి పడగెత్తి, ఒక ఆట ఆడుతుంది. కవ్విస్తుంది. గ్రుడ్లురిమి చూస్తుంది. కదిలితే కరుస్తానన్నట్టు మనవంకసూటిగా కొరకొరాచూస్తూ నిటారుగా గడకర్రలా అది నిలబడినంత సేపూ మనమూ నిలబడవలసిందే. కదలడానికీ వీల్లేదు. మెదలడానికీ వీల్లేదు. అంత ఎందుకు దృష్టి మరల్చడానికే వీలులేదు.

*　　　　*　　　　*

కళ్ళు పెద్దవిచేసుకొని తప్పించుకొని పారిపోతున్న పామువంక చూచాను. అప్పటికే అది చాలాదూరం పోయింది. పొదలో దూరుతోంది. అక్కడ ఏ పుట్టో ఉండి ఉంటుం దనిపించింది. పోతేపోయిందిలే అనుకొన్నా ఒక్కక్షణం. మరుక్షణంలో అది పగపట్టిందేమోనన్న అనుమానం కలిగింది. అటువంటి అనుమానం రానేకూడదు. వచ్చిందా మరి మనస్సు క్షణం నిలువదు. ఎన్నడూలేనిది ఆ సమయంలో నాకు గుండె దడదడలాడింది.

అటువంటి అనుభవం నాకు క్రొత్త. కాని పాము పగపట్టడం మాత్రం ఎరుగుదును.

మా గ్రామంలో ఓంప్రథమంగా నివాసం ఏర్పరచుకొన్న సత్యనారాయణగారి ఇంటిముందు గున్నమామిడి మొగదల్లో ఏపుగాపెరిగిన మొగలిపొదలో పీఠంవేసింది ఓసారి ఒకపాము. ఆయన వచ్చి కర్రతో అదిలించారు. అది బుస కొట్టి భయపెట్టింది. ఆయన భార్య వచ్చి

పాముకు నమస్కరించి పుట్టలో పాలుపోస్తానని మ్రొక్కుకొని వెళ్ళిపొమ్మని ప్రాధేయపడ్డది. కాని అది కదలలేదు. మాటిమాటికీ బుసకొడుతూ భయపెట్టడం మొదలుపెట్టింది. సత్యనారాయణగారు ఉప్పరివాళ్ళను పిలిపించారు. వాళ్ళువచ్చి దాన్నిచూచి తమవల్లకాదని వెళ్ళిపోయ్యారు అప్పుడు నిడుమోలు సూర్యప్రకాశరావుగారికి కబురువెళ్ళింది.

ఆయన అక్కడకు వచ్చీరావడంతోటే దాని వాలకం కనిపెట్టాడు. సత్యనారాయణగారితో "ఏమండీ మీ పెద్దబ్బాయి ఎప్పుడు వస్తున్నాడు ?" అని అనేవరికి నాకు అర్థమయింది ఎందు కా ప్రశ్న వేశారో. కాని సత్యనారాయణగారికి అర్థంకాలేదు. "వాడు రాత్రే రావలసింది, ఎక్స్‌ప్రెస్ అంది ఉండదు. మెయిల్లో బయలుదేరితే ఇంక కాసేపటికి రావాలి" అన్నాడు. అల్లా అని ఒక్క క్షణం ఆగి ఏదో ఆలోచనలోపడి ఆశ్చర్యంగా "ఏం?" అని అడిగాడు. సూర్యప్రకాశరావుగారు విషయం వివరిస్తూ "ఇది వాడిమీద పగ పట్టింది. వాడు రాత్రి వచ్చివుంటే ప్రమాదం జరిగేదే. గండం గడిచింది. ఇది నాచేతిలో పడ్డది" అన్నాడు. తాను ముందుకు వెళుతూ నన్ను దాని వెనక్కు రమ్మన్నాడు.

మా అడుగుల చప్పుడు వినిపించి కాబోలు ఆ పాము ఒక్కసారి బుస్సున లేచి నిలబడి ముందుకూ వెనక్కూ తల త్రిప్పుతూ ఒకసారి ఆయనవంకా మరొకసారి నావంకా తీక్షణంగా చూచింది. సూర్యప్రకాశరావుగారు భయంలేదు వెళ్ళి కాచుకొమ్మని నాకు సంజ్ఞ చేశారు. పెద్దగా బుసలు కొడుతూ భయపెడుతున్నా లెక్కచెయ్యక ఆయన ముందుకు వెళ్ళారు. ఎన్నో విధాల దాన్ని అదలించి ఇవతలకు రప్పించే ప్రయత్నం చేశారాయన. కాని అది కదలలేదు. నేనూ కఱ్ఱ ఎత్తి అదలించారు. చప్పట్లు కొట్టాను, బెడ్డలు విసిరాను. ఊరికే బుసలు కొడుతుండే కాని ఎంతకూ బయటకు రాలేదు.

మే మిద్దరం ఎంతో సేపు అలా చెరోవైపునా నిలబడిపొయ్యాం. చివరకు విసుగు పుట్టి సూర్యప్రకాశరావుగారు నన్ను దూరంగా తీసుకొని వెళ్ళి "అది అల్లా రాదులే. మరి సత్యనారాయణగారి అబ్బాయి వచ్చే వేళ అయ్యింది. అతను బండి దిగంగానే నువ్వు అతన్ని అంటిపెట్టుకొని ఉండు. మీరిద్దరూ ముందుకు రాకండి. అదే వస్తుంది. ఆ తమాషా చూద్దువు గాని" అన్నారు

సరిగ్గా ఆయన అన్నట్లుగానే జరిగింది.

అతను బండి దిగాడోలేదో ఆ పాము ఒక్కక్షణంలో చుట్ట విప్పుకొని జరజరా పాకుతూ శరవేగంతో మావైపుకు వచ్చింది. మేమందరం చకితులమయ్యాం.

సూర్యప్రకాశరావుగారు దాన్ని దారిలో అటకాయించారు. అలా అడ్డువచ్చారన్న కోపంతో అది చరుగ్గన ఒకసారి లేచి తోకమీద నిలబడింది. అంత పొడవైన పాము అలా నిలబడ్డప్పుడు నెత్తిమీద కొట్టడానికి వీలుపడదని గ్రహించే ఆయన దాని నడుము విరగకొట్టడానికని గట్టిదెబ్బ కొట్టారు. కాని అది బహు విచిత్రంగా దెబ్బ తప్పించుకొన్నది. దెబ్బ తప్పించుకొని రోషపడి తనమీదకు వస్తుందని అనుకొన్నారాయన కాని అది ఆయనపైకి దూకడానికి బదులు మావైపుకు దూకింది. అప్పుడు మా అందరికీ మరింత స్పష్టంగా అర్థం అయ్యింది-దాని దృష్టిఅంతా సత్యనారాయణగారి కుమారునిపైనే ఉన్నదని. ఏది ఏమైనా సరే పగతీర్చుకోడానికే అది సిద్ధపడ్డదని అందరికీ తెలిసివచ్చింది.

దూరంగా నేలమీద పడేసి ఉంచిన పొడుగాటి బల్లెం పుచ్చుకొని సూర్యప్రకాశరావుగారు ఒక్క పరుగున దాని ముందుకువచ్చి గురిచూచి ఒక్కవేటు వేశారు. ఆ బల్లెం ఆపాము నడుముపైన తాకి దాని

శరీరంలోనుంచి దూసుకొనిపోయి, భూమిలో దిగబడి దూరుకొనిపోయింది. మరుక్షణంలో సూర్యప్రకాశరావుగారు దానికి బాగా దగ్గరగా వెళ్ళి ఇంకా బుసకొట్టి కరవొస్తున్న ఆపామును దుడ్డుకర్రతో పిచ్చికుక్కను బాదినట్లు బాది తల ఏదో తోక ఏదో తెలియకుండా పోయేటట్లు చితక పొడిచారు.

ఎన్నడో జరిగిన ఈ సంఘటన ఒక్కసారి స్ఫురణకు వచ్చేసరికి ఒడలు జలదరించింది. ఆ పాములాగా ఇదికూడా పగబడుతుందేమో అన్న భయం కలిగే గబగబా ఆ పొదవైపు పరుగెత్తాను. కాని అది అక్కడ కన్పించలేదు. అక్కడ కన్పించి పుట్టలో దూరిందేమోనని కర్రతో పుట్ట పైభాగం చెదరగొట్టాను. మట్టి లోపల పడితే పాము బయటకు వస్తుందనుకొన్నాను. కాని అటువంటిదేమీ జరగలేదు పొలంనుంచి ఇండ్లకు పోతున్న కొంతమంది రైతులు కన్పిస్తే కేకలుపెట్టి పిల్చాను. మేం అంతా కలిసి పుట్టంతా పెళ్ళగించాం. కాని పాముజాడ కన్పించలేదు. "అదేదో జర్రిగొడ్డు అయి ఉంటుంది. త్రాచయితే అప్పుడే నిలవేసేది. పదండి పోదాం" అని వాళ్ళు నన్ను బలవంతం చేసి వెంటనే బయలుదేరతీసి వెంట పెట్టుకొని ఊళ్ళోకి తీసుకొనివచ్చారు. నన్ను ఇంటిదగ్గర వదలిపెట్టి వెళుతూ మా అమ్మతో జరిగిన విషయమంతా చెప్పి వెళ్ళారు.

* * * * *

ఒకటి రెండు రోజులు గడిచేసరికి ఆ పాము నాపై పగ పట్టిందేమోనన్న అనుమానం క్రమంగా పోయింది, కాని మా అమ్మకు మాత్రం ఆ అనుమానం ఎందువల్లనో క్రమంగా దృఢపడ్డది. మా నాన్నగారు ఈ విషయం మొదట్లో అంతగా పట్టించుకోలేదు. కాని బయట ఇతరత్రా విచారించిన మీదట ఆయనకూ భయం కలిగినట్లున్నది. "యుగయుగాలుగా శారీరకంగా, మానసికంగా ఎంతో పరిణామం చెందుతూ వచ్చిన మానవజాతి

లోనే ఈనాటికింకా పగబట్టే స్వభావం కల్పిస్తున్నదే! అటువంటివి పాములు పగ పట్టడం విచిత్రమా? అది అసలే పాపజాతి" అంటూ మాట్లాడటం మొదలుపెట్టాడు. ఆయన మాటలు వింటున్నకొద్దీ మా అమ్మకు భయం ఎక్కువ అయ్యింది

ఇద్దరూ కలిసి నాపై ఎన్నో ఆంక్షలు విధించారు నన్ను బయటకు కదలనివ్వలేదు. అల్లా ఒక వారం గడిచింది నాకేవిధమైన ప్రమాదం లేదనీ, అది పగ పట్టి ఉండదనీ, ఒకవేళ నామీదకు వచ్చినా దాన్ని హతమార్చగలననీ మా వాళ్ళతో నెమ్మదిగా నచ్చచెప్పడానికి ప్రయత్నించాను.

ఆ రోజు పౌర్ణమి.

మధ్యగదిలో కూర్చుని మా నాన్నగారూ నేనూ ఏదో పిచ్చా పాటి మాట్లాడుకొంటున్నాము. నేను బయటకు వెళ్ళకపోవడంచేత వ్యవసాయం దెబ్బ తింటున్నదనీ అందువల్ల ఆ మర్నాటినుంచి నేను పొలం వెళ్ళడానికే నిశ్చయించుకొన్నాననీ చెప్పాను. మా అమ్మ అప్పటిదాకా అక్కడే కూర్చుని మా మాటలు వింటూఉన్నదల్లా ఒక్కసారి చప్పున లేచి వెనుకవైపు వరండాలోకి వెళ్ళింది. మరికొన్ని క్షణాల తర్వాత మా నాన్నగారు కూడా అటు వెళ్ళారు. ఒకటి రెండు నిముషాలదాకా ఇద్దరూ రాకపొయ్యేసరికి ఏమిటా ఇది అని నేనూ వెళ్ళాను.

* * * *

నేను వెళ్ళేసరికి మా అమ్మ కళ్ళు మూసుకొని రెండు చేతులూ ఎత్తి నమస్కరిస్తూ నిలబడి ఉన్నది. కొంచెం దూరంలో మానాన్నగారు నిశ్చేష్టులై నిలబడి ఉన్నారు. కొంతసేపటికిగాని ఆయన నా రాక గమనించనే లేదు. గమనించిన మరుక్షణంలో లోపలకు వెళ్ళమని నాకు సంజ్ఞ చేశారు.

పది నిముషాల తర్వాత మా నాన్నగారు తిరిగివచ్చి జరిగిన విషయం చెప్పారు. ఎక్కడో ఏదో అలికిడి, బుసకొట్టినట్లు పెద్దగా ధ్వని వినిపించి

మా అమ్మ వరండాలోకి వెళ్ళిందట మెట్లదిగువన పారిజాతం చెట్టుప్రక్కన వెన్నెలలో ఆ పాము స్పష్టంగా కన్పించిందట. మానాన్నగారు వచ్చాక కాని అది అక్కడనుంచి కదలి వెళ్ళలేదట.

మొదట నాకు అదంతా విచిత్రం అనిపించింది మరుక్షణంలో మా అమ్మమీద కోపం వచ్చింది. పాము నిజంగా కన్పిస్తే వెంటనే కేకవేసి నన్ను ఎందుకు పిలవలేదని మా అమ్మను కోపంగానే అడిగాను

మా అమ్మ సమాధానం చెప్పకపోగా తప్పు అన్నట్లు ముక్కుమీద వేలు వేసుకొన్నది.

x x x x x

ఆ రోజునుంచి పదిరోజులదాకా రాత్రిళ్ళు నాకు బొత్తిగా నిద్రలేదు. అందుకు కొంత కారణం మా అమ్మ నిద్రమానుకొని రోగికి సేవ చేస్తున్నట్లు పగలూ రాత్రి నన్ను కనిపెట్టుకొని ఉండడం. అలాటి చాదస్త్రం ఆనాటికానాడు మరీ ఎక్కువ అయ్యిందేకాని తగ్గలేదు. "ఆ వెధవపాము వచ్చి నాపై కసి తీర్చుకొన్నా బాగుండిపోను" అనిపించింది నా మట్టుకు నాకు. పొలంపనులు పాడైపోతున్నాయి. ఏరోజు కారోజు రేపటినుంచి నేను పొలంపోతాను అంటూ ఉండగా రోజులు గడిచి పోయాయి. ఆరోజు అమావాస్య.

భోజనాలు అయ్యాక ముందు వరండాలో కూర్చుని మా నాన్నగారితో అవీ ఇవీ మాట్లాడాను. నేను బయటకు వెళ్ళకపోవడంవల్ల పొలం పనులు చెడుతున్నాయనీ, దాదాపు నెలరోజులు గడిచిపోయాయని కనుక ఆ పామువల్ల ఇక ప్రమాదమేమీ ఉండకపోవచ్చునని ఆయనకూడా అనడంతో నాపని కొంచెం సులువయ్యింది. ఆ మరునాటినుంచి ఇంక యథేచ్ఛగా బయటకు వెళతానని ఆదరితో చెప్పాను. మాఅమ్మకూడా అడ్డుచెప్పలేదు.

నేను మామూలుగా పడుకొనే గది మరీ చీకటిగా ఉన్నదని నా మంచం మధ్యహాలులోకి మార్పించింది మాఅమ్మ. రోజులా నాదగ్గరగా ఎక్కువసేపు కూర్చోక నా మంచానికి దూరంగా చాప వేసుకొని పడుకొన్నది. నా నిర్ణయం ప్రకటించినప్పటినుంచి ఇప్పటిదాకా మాఅమ్మ సరే అని కానీ వీల్లేదనికానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కోపం వచ్చిందేమో అనిపించింది. వస్తేవచ్చింది. అడ్డుచెప్పలేదు. అదే పదివేలు" అనుకొంటూ నిద్రకు ఉపక్రమించాను. పామును కొట్టడమంటే ఒక సరదాక్రింద తయారైన నాకే పాము పగపట్టిందేమో అని భయం కలగడం ఆ భయం మా అమ్మ పసికట్టడం ఆవిడ ఇంత ఆదుర్దా పడటానికి ప్రధాన కారణమని అప్పుడు తెలిసివచ్చింది. ఎంత వెఱ్ఱిగా ప్రవర్తించానా అని నాలో నేనే నవ్వుకొన్నాను.

మనసు తేలికపడడంవల్ల కాబోలు ఆరోజు నాకు పడుకోగానే మంచి నిద్రపట్టింది. నా కంటిముందు ప్రక్కగదిలో మానాన్నగారు సుఖంగా నిద్ర పొయ్యారు. రాత్రి పన్నెండు గంటల ప్రాంతలో ఒకసారి మెలకువ వచ్చింది. లేచి కాసేపు కూర్చున్నాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది. ప్రక్కగదిలో నుంచి మా నాన్నగారి గురక వినపడుతున్నది. మాఅమ్మవంక చూచాను. మంచి నిద్రలో ఉన్నట్లు కన్పించింది. "అమ్మయ్య ఇన్నాళ్ళకు మళ్ళీ అందరికీ నిద్రసౌఖ్యం కలిగింది" అనుకొని సంతృప్తిపడ్డాను. మళ్ళీ పడుకొని ఆదమరచి నిద్రపొయ్యాను.

అల్లా ఎంతసేపు నిద్ర పొయ్యానో ! కొన్ని యుగాలే నిద్రపొయ్యానేమో అనిపించింది. ఎవరో ఎక్కడో పెద్దగా కేకవేసినట్లు వినిపించి చప్పున మెలకువ వచ్చింది. పీడకల వచ్చిందా అనిపించింది. ఒడలు జలదరించింది. లేచి కూర్చుని కళ్ళు నలుపుకొని అటూ ఇటూ చూచాను.

కథా నిలయం
2069

ఎటు చూచినా గాఢాంధకారం. అది కలకాదనీ కొద్ది నిముషాలక్రిందట ఆగదిలోనే మాఅమ్మ కేక వేసిందనీ ఏదో స్ఫురణకు వచ్చినట్లయ్యింది. మంచం దిగి అటూ ఇటూ చూచాను. బల్లమీద ఉన్న అగ్గిపెట్టె తీసుకొని ఆరిపోయిన బుడ్డిదీపం వెలిగించాను.

దీపం వెలిగించిన మరుక్షణంలో నేలమీద పడిఉన్న మాఅమ్మ కన్పించింది. నాగుండె దడదడలాడింది. అటువైపు పరీక్షగా చూచాను. ఆ ప్రక్కనే కుప్పగా పడిఉన్న కంబళీక్రిందనుంచి పాముతోక కన్పించింది. వెంటనే కట్టెతీసుకొని దగ్గరకువెళ్ళి కంబళీతీశాను.

అది పెద్దగా బుసకొట్టింది.

కాని పైకి లేవలేకపోయింది ఆపాము. బాగా దగ్గరకువెళ్ళి పరీక్షగా చూచాను. నడుము విరిగినట్టున్నది. నడుముమీద బలంగా అరికాళ్ళతో త్రొక్కివేసినట్లు దాఖలాకూడా కన్పించింది. ఆపాము నేను అంతదగ్గరకు రావటంచూచి చప్పున తలఎత్తి భయంకరంగా, పెద్దగా బుసకొట్టింది.

ఇటు చూచాను - మాఅమ్మకు క్రమంగా స్పృహతప్పిపోతున్నది.

అటు చూచాను - నాపై పగతీర్చుకోడానికి ఇంకా అవకాశం ఉన్నదనుకొన్నది కాబోలు ఆపాము పడగఎత్తి లేవడానికి నాల్కలు మూరెడు పొడుగుచాచి కాటువెయ్యడానికి విశ్వప్రయత్నంచేస్తున్నది.

"పగ ఎంత నీచమైందీ" అనిపించింది. "పుత్రవాత్సల్యం ఎంత ఉదాత్తమైందీ" అని కూడా అనిపించింది ఆ మరుక్షణంలో.

ఒకవైపు పాముపగ మరోవైపు మాతృప్రేమ స్వరూపాలు స్పష్టంగా రూపుకట్టాయి. ఒకవైపురాక్షసి మరోవైపు దేవత ప్రత్యక్షమైనట్లు అనిపించింది.

ఒక్కదెబ్బతో ఆపాము శిరస్సు వ్రయ్యలు చేశాను. కసితీరలేదు. జరిగిన అన్యాయం జ్ఞాపకం వచ్చేసరికి క్రోధంతో వణికిపొయ్యాను. ప్రాణంపోసి దాన్ని మళ్ళీ ఎలాగో బ్రతికించి, ఎదిరించి చివరకు కత్తితో ముక్కలకింద నరకాలని అనిపించింది. "ఛీ ఏమిటీపగ" అనిపించింది మరుక్షణంలో. అల్లా అనిపించిన మరుక్షణంలో నాకోసం ఆత్మార్పణం చెయ్యడానికి సిద్ధపడిన మా అమ్మవైపుకు నాదృష్టి మరలింది. ఇంతసేపూ అటు వెళ్ళకపోవడానికి కారణం తెలిసివచ్చి నాప్రవర్తనకు నేనే సిగ్గుపడ్డాను. "అమ్మా" అని అరుస్తూ ఒక్కగంతున మాఅమ్మదగ్గరకు వెళ్ళాను.

నా కేకలకు మెలకువవచ్చి మానాన్నగారు ప్రక్కగదిలోనుంచి గబగబా వచ్చారు. ఆయన "అయ్యో ఎంతపని జరిగింది" అని మొదట్లో ఎంతో ఆవేశపడిపొయ్యారు. కాని మరుక్షణంలో పాములనరవయ్యగారు మంత్రించేస్తే ఆవిడ బ్రతుకుతుందని జ్ఞాపకం రావడం మమ్మల్నందరినీ గట్టెక్కించింది.

---